## క్లుప్తంగా

### విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీ తిలక్

**చింతకాని:** మండలంలోని రాఘవాపురం గ్రామంలో లో ఓల్టేజీ సమస్యను తీర్చేందుకు మండల విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏడీ తిలక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు గ్రామంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వెంకన్న, గ్రామపెద్దలు కొల్లి గోవిందరావు, సింగారపు సత్యనారాయణ, అబ్బూరి మహేష్, దొబ్బల హనుమంతురావు, నర్సింహారావు, వడ్డే రమేష్, విద్యుత్ లైన్‌మెన్లు కిషన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

### సొంత నిధులతో కాలువ మరమ్మతులు



జేసీబీతో అమ్మపాలెం పెద్దచెరువు లింక్ కెనాల్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**వేంసూరు:** మండలంలోని అమ్మపాలెం పెద్ద చెరువుకు బేతుపల్లి జలాలు చేరేందుకు బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ నుంచి లచ్చన్నగూడెం మీదుగా అమ్మపాలెం పెద్ద చెరువుకు వచ్చే లింక్ కెనాల్‌లో చెట్లు, పొదలు, పూడికతీత ఉండటంతో అమ్మపాలెం పంచాయతీ సత్యనారాయణపురం గ్రామానికి చెందిన పుచ్చకాయల కాంతరెడ్డి సొంతనిధులతో కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

### శాకాంబరీ దేవిగా కోట మైసమ్మ



శాకాంబరీ దేవి అలంకరణలో అమ్మవారు

**తల్లాడ:** తల్లాడలో వేంచేసి ఉన్న కోట మైసమ్మ అమ్మవారు బుధవారం శాకాంబరీ దేవిగా దర్శన మిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకుడు కంచెల సతీష్ శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**వైరారూరల్:** మండలంలోని ఖానాపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం అమరజీవి తోట పెద్దగోపయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు మాట్లాడారు. జమీందారులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తోట పెద్దగోపయ్య కుక్క వెంకటేశ్వర్లు, వేగంటి నారాయణ, వేగంటి జోగయ్య, గరిడేపల్లి వెంకటేశ్వరరావుతో దళంగా ఏర్పడి జమీందారులకు వ్యతిరేకంగా పని చేసినట్లు వివరించారు. అనంతరం గోపయ్య స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. నాగేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, నర్సింహారావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు రైతు రుణమాఫీ సంబురాలు

**సత్తుపల్లి/వేంసూరు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నికల్లో హామీలో భాగంగా రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేసిన సందర్భంగా గురువారం సాయంత్రం 4 గంటల నుంచి సత్తుపల్లి, వేంసూరులో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్ ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి బస్టాండ్ రింగ్ సెంటర్ మీదుగా కొత్తూరు రైతు వేదిక వరకు, వేంసూరులోని రైతు వేదిక వరకు రైతులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులతో ర్యాలీ నిర్వహించబడుతుందన్నారు. అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పశువులకు వైద్యం అందేదెలా..?

- తల్లాడ, కుర్నవల్లి పశువైద్య శాలలకు ఇన్‌చార్జ్ డాక్టరే
- అన్నారుగూడెం, మిట్టపల్లి వైద్యశాలలకు వెటర్నరీ ఆఫీసర్లు కూడా లేరు
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు



వెల వెల బోతున్న ఆస్పత్రి



వైద్యాధికారి లేని తల్లాడ పశువైద్యశాల



సిబ్బంది లేక మూసి ఉన్న గదులు

**తల్లాడ:** అరకొర సిబ్బందితో వైద్యం సేవలందటం లేదు. మూగ జీవాలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్న సకాలంలో వైద్యం అందడం లేదు. పశువైద్య శాలలకు వైద్యులు లేక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మూగజీవాలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వైద్యం అందటం లేదు. మండలంలో రెండు పశువైద్య కేంద్రాలు, రెండు సబ్ సెంటర్లు ఉన్నప్పటికీ సరిపడాస్థాయిలో సిబ్బంది లేరు.

**తల్లాడ, కుర్నవల్లి పశువైద్య శాలలకు ఇన్‌చార్జ్ వైద్యుడే..**

తల్లాడ, కుర్నవల్లి పశువైద్య శాలలకు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ఖాళీగానే ఉన్నాయి. దీంతో వైరా పశువైద్యాధికారి రాకేష్ ఈ రెండు పశువైద్య శాలలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ వైద్యాధికారి వైరా మండలంతో పాటు.. తల్లాడ మండలంలో కూడా వైద్యసేవల అందించాలంటే కష్టంగానే ఉంది. వారానికోసారి మీటింగులున్నప్పుడే మాత్రమే వస్తూ పోతూ ఉంటారు. తల్లాడ, కుర్నవల్లి పశువైద్య శాలల్లో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు మాత్రమే వైద్యం అందిస్తున్నారు. పశువులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి.

**మిట్టపల్లి, అన్నారుగూడెంకు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు లేరు..**

మిట్టపల్లి, అన్నారుగూడెం సబ్ సెంటర్లకు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు(జేవీఓ) లేకపోవటంతో అక్కడ కేవలం అటెండర్లు మాత్రమే వైద్యం చేయాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి ఇక్కడ జేవీఓలు నియామకం జరగటం లేదు. దీంతో ఆ రెండు గ్రామాల ప్రజలకు గోపాల మిత్రలే ఆధారం.

**మృత్యువాత పడుతున్న మూగజీవాలు..**

తల్లాడ మండలంలో ఆవులు, గేదెలు 15 వేలు ఉన్నాయి. వాటితో పాటు దూడలు మరో ఐదు వేలు ఉన్నాయి. గొర్రెలు, మేకలు 11 వేలు, పందులు వంద, కుక్కలు 2,500 ఉన్నాయి. వీటికి ఈ వర్షాకాలం సీజనలో వచ్చే వ్యాధులకు వైద్యం అందటం లేదు. ఈ సీజన్లో గేదెలకు గురక జబ్బు, ఆవులకు జబ్బవాపు, గొర్రెల్లో చిటికె వ్యాధి, కుక్కల్లో ర్యాబిస్ సోకుతాయి. వీటికి సకాలంలో వైద్యం అందకపోవటంతో 27 గ్రామ పంచాయతీల్లో మృత్యువాతకు గురౌతున్నాయి. ఇప్పటికైనా మండల పశువైద్యాధికారితోపాటు, కుర్నవల్లి కేంద్రానికి డాక్టరు, సబ్ సెంటర్లకు సిబ్బందిని నియమించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

**త్వరలోనే పోస్టుల భర్తీ..**



త్వరలోనే తల్లాడ, కుర్నవల్లి పశువైద్య కేంద్రాలకు వైద్యులు వస్తారు. డాక్టర్ల నియామక ప్రక్రియ జరుగుతుందని, అందులో తల్లాడ, కుర్నవల్లికి వైద్యులను కేటాయిస్తారు. మండలంలోని పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందని, సాధమైనంత మేరకు వైద్యసేవలందిస్తున్నాం.

– రాకేష్, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, తల్లాడ

**వైద్యులను నియమించాలి..**



తల్లాడ, కూర్నవల్లి పశువైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలి. డాక్టరు లేకపోవటంతో పశువులకు వైద్యం అందటం లేదు. వర్షాకాలం సీజన్‌లో పశువులకు వివిధ రకాల వ్యాదులు సోకే ప్రమాదం ఉంది. వైద్యం కోసం వచ్చిన వారు తమ పశువులను తీసుకొని నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది.

– బొడ్డు నరేష్, గొల్లగూడెం

**పట్టించుకునే వారే లేరు..**



తల్లాడ వైద్యశాలకు డాక్టర్ లేకపోవటంతో పశువులను పట్టించుకునే నాధుడు లేడు. వేలాది పశువులున్నా ఆస్పత్రికి రెగ్యులర్ డాక్టరుంటేనే సరిపోతుంది. ఇన్‌చార్జ్ డాక్టరు ఎప్పుడు వస్తారో.. పోతారో తెలియక మూగజీవాలు సరైన వైద్యం అందడం లేదు.

– దగ్గుల శ్రీనివాసరెడ్డి, తల్లాడ

# భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న పీర్ల సావిడి నుంచి పీర్లను ప్రధాన వీధుల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించగా.. భక్తులు నీరు పోసి, పూల దట్టీలను వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను తిరిగి సావిడిలో ఉంచి ప్రత్యేక పార్థనలు చేసి అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



తల్లాడలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు



కొణిజర్ల: అమ్మపాలెం దర్గాలో పూజలు చేస్తున్న ముస్లిం పెద్దలు



వైరారూరల్: తాటిపూడిలో..



కల్లూరులో..



చింతకాని: నేరడ గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లిం మత పెద్దలు



ముదిగొండ: అయ్యగారిపల్లిలో..



ఎర్రుపాలెంలో..



బోనకల్‌లో..



ఏన్కూరులో..

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



కాలువ పూడిక తీత పనులను పరిశీలిస్తున్న మట్టా దయానంద్, నాయకులు

**పెనుబల్లి:** రైతు సంక్షేమమే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ రెండు కాలువల పూడిక తీత పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం ఎమ్మెల్యే రాగమయి తన సొంత ఖర్చుతో పూడిక తీత పనులు చేపట్టారని.. వారం రోజులుగా జరుగుతున్న ఈ పనులను రైతులు చివరి ఆయకట్టు వరకు చేరాలా దగ్గరుండి పనులు చేయించుకోవాలన్నారు. రైతులకు రుణమాఫీలో భాగంగా గురువారం రూ.లక్ష లు తమ కాతాలో జమ అవుతాయన్నారు. సత్తుపల్లిలో నేడు నిర్వహించే ర్యాలీలో కాంగ్రెస్ రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, చీకటి రామారావు, మోరంపూడి బాబురావు, పంది వెంకటేశ్వరరావు, వంగా దామోదర్, తేళ్ల ఆనందరావు, గూడూరు మాధవ రెడ్డి, విశ్వనాథ్, వెంకటేశ్వరరెడ్డి, అలుగోజు చిన్నస్వామి, పిల్లి నవజీవన్, ఆయకట్టు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన హస్తకళల కార్పొరేషన్ చైర్మన్



సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

**వైరా/కొణిజర్ల:** రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా వైరా వాసి నాయుడు సత్యనారాయణ బుధవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, నారాయణరావు, నరేందర్, సీతారాములు, దానియేలు, శబరీనాథ్, అశోక్, గంగారావు, కొండలు, కోసూరి శ్రీనివాసరావు, రాంపూడి రోశయ్య, మోష, సైదారావు, రాజరావు, గుడివాడ వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్యాంసన్ తదితరులు సైతం హాజరయ్యారు.

# ఘనంగా తొలిఏకాదశి పూజలు

తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో సహస్రనామార్చనలు, హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు హరే రామ హరే కృష్ణ అంటూ భక్తులు ఏక నామం భజన గావించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరు: గార్లఒడ్డు శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో..



వేంసూరు: భీరపల్లి భజన మందిరంలో పూజలు చేస్తున్న అర్చకుడు



తల్లాడ: హనుమత్ పద్మావతి వేంకటేశ్వర ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



ఎర్రుపాలెం: వెంకటాపురంలో..



కల్లూరు: వేణుగోపాలస్వామి దేవాలయంలో ఏకనామం పఠిస్తున్న భక్తులు



సత్తుపల్లిటౌన్: పూజల్లో పాల్గొన్న భక్తులు

### బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ మధుబాబు

**బోనకల్:** మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన నల్లల దోరబాబు అనే వ్యక్తిగత పది రోజుల కింద వీవో వై200 మోడల్ గల సెల్‌ఫోన్‌ను ద్విచక్ర వాహనంపై వెళ్తూ పోగొట్టుకున్నాడు. బాధితుడు ఆరోజే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ పోర్టల్ సీఐఇయర్ మొబైల్ ట్రేసింగ్ యాప్ ద్వారా ట్రేస్ చేసి బుధవారం బోనకల్ ఎస్‌ఐ మధుబాబు చేతుల మీదుగా బాధితుడికి అందించారు. కార్యక్రమంలో ఏఎస్సై సువర్ణబాబు, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ పాల్గొన్నారు.

### అచేతన స్థితిలో గుర్తుతెలియని మహిళ

**మధిర:** జిలుగుమాడు సాయి నగర్ సమీపంలో బుధవారం ఒక గుర్తు తెలియని మహిళ అచేతన స్థితిలో ఉంది. ఆమెను గుర్తించిన ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుడు దోర్నాల రామకృష్ణ బృందం ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను వివరాలు అడగ్గా ఏమి చెప్పలేని స్థితిలో ఉంది. ఆమెను అంబులెన్స్ వాహనంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే టౌన్ పోలీసులకు గాని, ఆర్కే ఫౌండేషన్‌కి గాని తెలియజేయాలని కోరారు.

### నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎంపీపీ లలిత దంపతులు

**మధిర:** మధిర పట్టణంలోని శ్రీ విష్ణ్వేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఎంపీపీ మెండెం లలిత, వెంకన్న దంపతులు ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్ మాట్లాడుతూ.. ప్రతి బుధవారం దాతల సహకారంతో నిరుపేదలకు ఆలయం వద్ద అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నదానం చేయదలచిన వారు 7981652195 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 21న బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

**మధిర:** మధిర పట్టణంలోని శ్రీ దివ్య షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 21న వ్యాస గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు పబ్బతి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న స్వామికి కాగడా హారతి, మంగళ స్నానం, పంచామృతములతో అభిషేకం, స్వామికి దివ్యాలంకరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

**సత్తుపల్లిరూరల్:** బదిలీలు నిర్వహించి ఉపాధ్యాయులను రిలీవ్ చేయకపోవటం వల్ల రిలీవ్‌కాని వారు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న గెజిటెడ్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు నిర్వహించాలని కోరారు. నూతన ఉపాధ్యాయులు వచ్చే వరకు ఖాళీలలో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వి.రామారావు, రమేష్, రాజేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, ఈశ్వరాచారి, ప్రసాద్, వీరస్వామి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దుర్గా మల్లికార్జునస్వామి ఆలయానికి వితరణ



నగదు అందజేస్తున్న భక్తులు

**పెనుబల్లి:** వీయంబంజర్ ఎన్ఎస్‌పీ కాలువ వద్ద ఉన్న దుర్గా మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు రూ. 25వేలు వితరణగా అందజేశారు. వీయంబంజర్‌కు చెందిన కేతేపల్లి వాసు, ధనలక్ష్మి దంపతులు రూ.10 వేలు, బండి శ్రీను, విజయ దంపతులు రూ.5 వేలు, వలివేటి రాజశేఖర్, విజయ శ్రీ దంపతులు రూ.5 వేలు, కోటూరు పాండు రంగారావు రూ.5 వేలు, నగదును ఆలయ నిర్వాహకులు యారం వెంకటేశ్వరరావు, వంగా చంద్రశేఖర్‌రావులకు అందజేశారు.

# ప్రశ్నార్థకంగా వరిసాగు..

- చెరువులు, కట్లేరులోకి చేరని వర్షపు నీరు..
- ఆందోళనలో అన్నదాతలు



వెలవెలబోతున్న కట్లేరు



పెద్దగోపవరంలో దమ్ము చేయని మాగాణి భూములు

**ఎర్రుపాలెం:** మండలంలో ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జూన్ నెలలో నామ మాత్రంగా వర్షాలు పడటంతో రైతులు నిరాశ చెందారు. కాగా.. జూలై మొదటి వారంలో మెట్ట పంటలకు మాత్రమే అనుకూలంగా వర్షాలు పడుతుండటంతో రైతుల్లో కొంతమేరకు ఆశలు చిగురిస్తున్నాయి. వరిసాగు చేసుకునే స్థాయి వర్షాపాతం లేకుండా పోయింది. ఈ సంవత్సరం జూన్ నెలలో 105 మి.మీ వర్షపాతం నమోదు కాగా, జూలై నెలలో 29 మి.మీ వర్షం పడింది. మండలంలోని ప్రధాన జలవనరులుగా ఉన్న కట్లేరు, జమలాపురం పెద్ద చెరువు, మామునూరు పేట చెర్వు ఇలా అన్ని చెరువులు, బోర్ల కింద దాదాపు 10 ఎకరాల వరకు వరిపంట సాగు చేసే అవకాశం ఉంది.

**ప్రశ్నార్థకంగా మారిన వరిసాగు..**

ఈ సంవత్సరం వర్షాభావం కారణంగా సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటి వరకు చెరువుల్లోకి, కట్లేరులోకి చుక్కనీరు చేరలేదు. దీంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు గత ఏడాది మాదిరిగానే పత్తిపంట సాగు చేసేందుకే అధికంగా మొగ్గు చూపుతున్నారు. అన్ని పంటలు కలిసి మొత్తం 34 ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా అందులో దాదాపు 12వేల ఎకరాల మేరకు పత్తి పంట సాగు చేపట్టారు. మిర్చి 3వేల ఎకరాల్లో, మామిడి 2,100 ఎకరాల్లో, మొక్కజొన్న 600 ఎకరాల్లో, పసుపు 70 ఎకరాల్లో, పామాయిల్ 1,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సుబాబుల్, జామాయిల్ 5,200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రకృతిపై, వరుణదేవుడిపై ఆశలు పెట్టుకున్న రైతాంగం బోర్ల కింద సాగు చేసే ఆలోచనతో అక్కడక్కడా వరి నారుమడులు పోసుకుని వరిసాగుకు సన్నద్ధం అవుతున్నారు.

**చెరువుల్లోకి నీరు రాలేదు..**



ఈ ఏడాది ఇంకా ఆశాజనకంగా వర్షాలు కురియలేదు. దీంతో మాగాణి భూముల్లో వరి సాగుకు కొంత ఇబ్బందిగానే ఉంది. నేటికి భూములు దమ్ము చేయలేదు. సాగు ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల్లోకి కూడా నీరు రాలేదు. గతేడాది కూడా సాగు చేయలేకపోయాం. జమలాపురం పెద్ద చెరువును సకాలంలో నింపితేనే సాగుకు అవకాశం ఉంది.

– కొనకంచి శ్రీనివాసరావు, రైతు, ఎర్రుపాలెం

**రైతులు ఆందోళన పడొద్దు..**



వరి సాగుకు ఇంకా కొంత సమయం ఉంది. వర్షాలు పడే అవకాశాలున్నాయి. వరి సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్లు వేసి కలియ దున్నితే భూములు సారవంతంగా తయారై అధిక దిగుబడులు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పంటల సాగులో అందుబాటులో ఉన్న ఏఈఓల సలహాలు, సూచనలను రైతులు తీసుకోవాలి.

– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏఓ, ఎర్రుపాలెం